క్లుప్తంగా

వెండి కిరీటం బహూకరణ



వెండి కిరీటం అందజేస్తున్న దాతలు

కర్నూలు కల్చరల్: నగర శివారులోని సూర్య నారాయణ ఆలయ ఆవరణలోని షణ్ముఖ సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి వెండి కిరీటం బహూకరించారు. శనివారం ఆలయం మేనేజింగ్ ట్రస్టీ శివరామకృష్ణకు ట్రస్ట్ సభ్యులు, దాతలు సీఏ రమేష్ వర్మ, పద్మలత, సీఏ రూపేష్, హారిక దంపతులు వెండి కిరీటాన్ని అందజేశారు. స్వామివారికి పంచామృతాభిషేక పూజలు నిర్వహించి వెండికిరీటాన్ని అలంకరించారు. ట్రస్ట్ సభ్యులు డాక్టర్ నగేష్, మాతృమండలి సభ్యులు పాల్గొన్నారు.

పరిమితికి మించి ప్రయాణికులు వద్దు

కర్నూలు: పరిమితికి మించి ప్రయాణికులను అనుమతిస్తే ఆటోలను సీజ్ చేస్తామని ట్రాఫిక్ డీఎస్పీ నాగభూషణం హెచ్చరించారు. మున్సిపల్ కార్యాలయం ఎదురుగా ట్రాఫిక్ నిబంధనలపై పోలీసులు ఆటోడ్రైవర్లకు శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ట్రాఫిక్ డీఎస్పీ నాగభూషణం అతిథిగా హాజరై మాట్లాడారు. ఆటోడ్రైవర్లు విధిగా లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. ఇన్సూరెన్స్ ఉన్న ఆటోలను మాత్రమే నడపాలని సూచించారు. రోడ్డు భద్రత మనందరి బాధ్యత అని, నిబంధనలు పాటిస్తూ ప్రయాణికులను గమ్యస్థానాలకు సురక్షితంగా చేరవేయాలన్నారు. కార్యక్రమంలో ఆర్ఎస్ఐ ఉసేన్ అహ్మద్‌తో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

అర్బన్‌హెల్త్ సెంటర్ ఆకస్మిక తనిఖీ



మాట్లాడుతున్న డాక్టర్ ప్రవీణ్‌కుమార్

కర్నూలు(హాస్పిటల్): జిల్లా వ్యాధినిరోధక టీకాల అధికారి డాక్టర్ వై. ప్రవీణ్‌కుమార్ శనివారం షరీన్‌నగర్‌లోని పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. గర్భిణిలు, పిల్లలకు సంబంధించిన వ్యాక్సినేషన్ రికార్డులు, వ్యాక్సిన్లు నిల్వ ఉండే శీతలీకరణ పరికరాలను ఆయన పరిశీలించారు. ఏఎన్ఎంలు తమ పరిధిలోని అర్హులైన చిన్నపిల్లందరికీ సమయానుసారంగా వ్యాక్సిన్లు ఇవ్వాలని ఆయన ఆదేశించారు. గర్భవతులకు కాన్పుకు వెళ్లాల్సిన ఆసుపత్రిని ముందుగానే గుర్తించి ఆ వివరాలను ఏఎన్ఎం యాప్‌లో నమోదు చేయాలని, ప్రమాదకర చిహ్నాలు ఉన్న వారిని మూడు రోజులు ముందుగా ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్చాలని సూచించారు. ఆయన వెంట వైద్యాధికారి డాక్టర్ ఫర్హీన్ తబుస్సుమ్, ఎంపీహెచ్ఎస్ శివకుమార్, డిస్ట్రిక్ట్ కమ్యూనిటీ మొబలైజర్ ప్రసాద్ ఉన్నారు.

కాలుష్య నియంత్రణ అందరి బాధ్యత

కర్నూలు కల్చరల్: కాలుష్య నియంత్రణ అందరి బాధ్యత అని, ప్లాస్టిక్ కవర్లు వద్దు గుడ్డ, నార సంచులు ముద్దు అని అనకాపల్లి జిల్లా నర్సిపట్నానికి చెందిన వైఈఆర్ రూరల్ పబ్లిసిటీ వారు కళా జాత నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో శనివారం మున్సిపల్ కార్యాలయం వద్ద ఈ కార్యక్రమం చేపట్టారు. ప్లాస్టిక్ వాడకం వల్ల కలిగే అనర్థాలు, వన సంపద– మన సంపదలపై అవగాహన కల్పించారు.సింగల్ యూజ్ ప్లాస్టిక్ కూడా నిషేధించినట్లు చెప్పారు.

సప్లిమెంటరీ పరీక్షలకు 839 మంది గైర్హాజరు

కర్నూలు సిటీ: పదవ తరగతి సప్లిమెంటరీ పరీక్షలకు శనివారం 839 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. 3,577 మంది విద్యార్థులకుగాను, 2738 మంది హాజరయ్యారు. నాలుగు ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు 16 కేంద్రాలను తనిఖీ చేశారు. ఎక్కడా మాల్ ప్రాక్టిస్ జరగలేదని ప్రభుత్వ పరీక్షల విభాగం అధికార వర్గాలు తెలిపాయి.

సేవలతోనే ఉద్యోగులకు గుర్తింపు



బదిలీ అయిన ట్రాఫిక్ సిబ్బందిని సత్కరిస్తున్న డీఎస్పీ నాగభూషణం

కర్నూలు : ప్రజలకు విధి నిర్వహణలో అందించే సేవలతోనే ఉద్యోగులకు తగిన గుర్తింపు లభిస్తుందని ట్రాఫిక్ డీఎస్పీ నాగభూషణం అన్నారు. ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో ఐదు సంవత్సరాల పాటు విధులు నిర్వహించి లాంగ్ స్టాండింగ్ కింద హెడ్ కానిస్టేబుల్ మహబూబ్ ఖాన్ కర్నూలు టూటౌన్‌కు, నాగరంగయ్య నాగలాపురం పీఎస్‌కు, కానిస్టేబుల్ చంద్రశేఖర్ ఉలిందకొండ పీఎస్‌కు, నరసప్ప ఆదోని తాలూకా, హుసేన్ వలి ఆదోని ట్రాఫిక్‌కు, రహంతుల్లా సి.బెళగల్ పీఎస్‌కు బదిలీ అయ్యారు. ఆరుగురు సిబ్బందికి వారి స్టేషన్లకు పాస్‌పోస్టు ఇచ్చి శనివారం సాయంత్రం ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో సత్కరించారు.

వాడీవేడిగా..



మాట్లాడుతున్న మేయర్ బీవై రామయ్య

- నగరపాలక సర్వసభ్య సమావేశంలో వివిధ అంశాలపై చర్చ
- టీడీపీ కార్పొరేటర్ల తీరుపై మేయర్ ఆగ్రహం
- టౌన్ ప్లానింగ్ పనితీరు సరిగ్గా లేదని ఎమ్మెల్యే కాటసాని ఫైర్
- ఆక్రమణలపై దృష్టి సారించాలన్న ఎమ్మెల్యే సుధాకర్
- డిప్యూటీ కమిషనర్‌ను ప్రభుత్వానికి సరెండర్ చేయాలి
- మెజార్టీ కార్పొరేటర్లు డిమాండ్
- రూ.34.19 కోట్ల అభివృద్ధి పనులకు కౌన్సిల్ ఆమోదం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాటసాని, చిత్రంలో కోడుమూరు ఎమ్మెల్యే సుధాకర్

కర్నూలు(టౌన్): నగరపాలక 15వ సర్వసభ్య సమావేశం శనివారం వాడీవేడిగా జరిగింది. వివిధ అంశాలు, సమస్యలపై చర్చ జరిగింది. ప్రతిపక్ష టీడీపీ సభ్యుల తీరుపై మేయర్ బీవై రామయ్య ఆగ్రహం వ్యక్తం చేయగా..టౌన్‌ప్లానింగ్ పనితీరు సరిగ్గా లేదని ఎమ్మెల్యే కాటసాని అసంతృప్తి వ్యక్తం చేశారు. నగరపాలక డిప్యూటీ కమిషనర్ ఎస్‌వీ రమాదేవిని ప్రభుత్వానికి సరెండర్ చేయాలంటూ అధికార పక్ష సభ్యులు డిమాండ్ చేశారు. చివరకు నగరంలో అన్ని ప్రాంతాలకు సమన్యాయం చేస్తూ రూ.34.19 కోట్లు విలువ చేసే అభివృద్ధి పనులకు కౌన్సిల్ ఆమోదం తెలిపింది.

టీడీపీ కార్పొరేటర్లకు మాట్లాడే అర్హత లేదు– మేయర్

నగరపాలక సంస్థ టీడీపీకి చెందిన 8 వ వార్డు కార్పొరేటర్ కురవ పరమేష్, 14 వ వార్డు కార్పొరేటర్ షేక్ జకియా అన్సారీలు సమావేశంలో మాట్లాడుతూ తమ వార్డులో అభివృద్ధి పనులు సక్రమంగా జరగడం లేదని, వార్డులో పర్యటించే టప్పుడు తమకు సమాచారం ఇవ్వాలన్నారు. దీనిపై మేయర్ బీవై రామయ్య స్పందిస్తూ 'టీడీపీ పాలనలో చంద్రబాబు ప్రతిపక్ష ఎమ్మెల్యేలను కార్యక్రమాలకు పిలిచిన దాఖలాలు లేవు. ప్రతిపక్ష పార్టీ ఎమ్మెల్యేలకు నిధులు ఇవ్వొద్దని బహిరంగంగా చెప్పారు. ఇదంతా మీరు తెలుసుకోకుండా మాట్లాడితే ఎలా' అని మండిపడ్డారు. తాము పార్టీలకు సంబంధం లేకుండా అభివృద్ధి పనులు చేస్తున్నట్లు స్పష్టం చేశారు.

టౌన్ ప్లానింగ్ పనితీరుపై ఎమ్మెల్యే కాటసాని ఫైర్

టౌన్ ప్లానింగ్ పనితీరు బాగా లేదని ఇన్‌చార్జ్ సిటీ ప్లానర్ మోహన్‌కుమార్‌పై ఎమ్మెల్యే కాటసాని ఆగ్రహం వ్యక్తం చేశారు. నాయుడు ఫంక్షన్ హాలు సీజ్ చేస్తే అక్కడ పెళ్లిళ్లు ఎలా జరుగుతాయని ప్రశ్నించారు. 'నగరంలోని అనేక చోట్ల ఖాళీ స్థలాలు ఉన్నాయి. వాటిని సంరక్షించండి. తాము పూర్తిగా సహకారం అందిస్తాం. విలువైన స్థలాలు కబ్జా చేస్తే సహించేది లేదు. అలాగే వారంలో మూడు రోజులు కమిషనర్, అధికారులు, కార్పొరేటర్లతో సమస్యలపై చర్చించాలి. అప్పుడే అనేక సమస్యలు పరిష్కారమవుతాయి. అధికార పార్టీ కార్పొరేటర్లు సైతం ప్రతిపక్ష పార్టీ నాయకుల మాదిరి మాట్లాడవద్దు. సమస్యలను కలిసి పరిష్కరించుకుందాం'మని ఎమ్మెల్యే చెప్పారు.

ఆక్రమణలపై చర్యలు తీసుకోండి – కోడుమూరు ఎమ్మెల్యే సుధాకర్

'ఎస్ఎల్ఎన్ గార్డెన్ మాసా మసీదు వెనుక శ్మశాన వాటికకు రోడ్డు లేదు. ఆక్రమణకు గురైంది. టౌన్ ప్లానింగ్ సిబ్బంది ఏం చేస్తున్నారు. తక్షణమే ఆక్రమణలపై చర్యలు తీసుకోవాల'ని ఎమ్మెల్యే సుధాకర్ అన్నారు. 'స్టాంటన్ పురంలో మెజిస్టిక్ ఫంక్షన్ హాలుకు పార్కింగ్ లేకపోయినా ఎలా అనుమతి ఇచ్చారు. మునగాల పాడులో అక్రమంగా వెంచర్లు వెలుస్తున్నాయి. ఎస్సీలకు చెందిన ఎక్సాల్ పట్టాలు ఉన్నాయి. పొజిషన్‌లో ఉన్న ఆన్‌లైన్‌లో ఎక్కించలేదు. అక్కడ పంప్‌హౌస్ నిర్మాణానికి ఎస్సీలు భూములు ఇచ్చారు. వారికి న్యాయం చేయాల'ని అధికారులకు సూచించారు. 12 ఏళ్ల నగరపాలకకు ఎన్నికలు నిర్వహించలేని టీడీపీ నాయకులు నేడు సభలో మాట్లాడటం వింతగా ఉందని విమర్శించారు.

డిప్యూటీ కమిషనర్‌ను సరెండర్ చేయండి

- సంతకాలు చేసిన మెజార్టీ కార్పొరేటర్లు

'స్వచ్ఛతలో ఇప్పుడిప్పుడే నగరానికి మంచి పేరు వస్తుంది. అయితే, శానిటేషన్ పర్యవేక్షణ చేసే డిప్యూటీ కమిషనర్ ఎస్‌వీ. రమాదేవి పనితీరు బాగాలేదు. ఫోన్ చేస్తే సమాధానం లేదు. ఆమెను ప్రభుత్వానికి సరెండర్ చేయాలని 39 మంది కార్పొరేటర్లు సంతకాలు చేశా'మని 40 వ వార్డు కార్పొరేటర్ విక్రమ సింహారెడ్డి సభ దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం కార్పొరేటర్లతో కలిసి మేయర్‌కు వినతిపత్రం ఇచ్చారు. దీనిపై పూర్తిగా చర్చించాలంటూ 25 వ వార్డు కార్పొరేటర్ సిత్రా సత్యనారాయణమ్మ చెప్పారు. పనితీరు సరిగ్గా లేదని కార్పొరేటర్లు చెప్పడంతో అడిషనల్ కమిషనర్ వల్లే తనను బలిపశువు చేస్తున్నారంటూ డిప్యూటీ కమిషనర్ రమాదేవి సభ మధ్యలోనే వెళ్లిపోయారు. సమావేశంలో కమిషనర్ భార్గవ్ తేజ, అడిషనల్ కమిషనర్ రామలింగేశ్వర్, మున్సిపల్ ఎస్ఈ వేణుగోపాల్, ఇంజినీర్లు, మున్సిపల్ సిబ్బంది, నగర పాలక డిప్యూటీ మేయర్ నాయకల్లు అరుణ, స్టాండింగ్ కమిటీ సభ్యులు, కార్పొరేటర్లు, కోఆప్షన్ సభ్యులు వివిధ విభాగాలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్టాండ్ దుకాణాల్లో తనిఖీలు



బస్టాండ్‌లోని దుకాణంలో తనిఖీ చేస్తున్న తూనికలు, కొలతల శాఖ అధికారులు

సాక్షి ఎఫెక్ట్

కర్నూలు (న్యూసిటీ): ఆర్టీసీ బస్టాండ్‌లోని దుకాణాలపై తూనికలు, కొలతల శాఖ అధికారులు దాడులు నిర్వహించారు. నిబంధనలకు విరుద్ధంగా తినుబండారాలు, వాటర్, కూల్‌డ్రింక్‌లు, వాటర్ బాటిళ్ల ఎక్కువ ధరకు విక్రయిస్తూ ప్రయాణికులను దోచుకుంటున్న వైనంపై 'ఇక్కడ అన్నీ అధిక ధరలే' అనే శీర్షికతో 'సాక్షి' శనివారం కథనం ప్రచురించింది. దీనిపై స్పందించిన తూనికలు, కొలత శాఖ డిప్యూటీ కంట్రోలర్ చల్లా దయాకర్ రెడ్డి తనిఖీలు చేయించారు. బస్టాండ్‌లోని షాపులే కాక చుట్టూ పక్కల ఉన్న దుకాణాలను అధికారులు తనిఖీలు చేసి ధరలపై ఆరా తీశారు. 8 షాపుల్లో కూల్‌డ్రింక్‌ను ఎమ్మార్పీపై రూ.2 నుంచి రూ.10 వరకు ఎక్కువ వసూలు చేస్తుండటాన్ని గుర్తించి కేసులు నమోదు చేశారు. సదరు షాపు యాజమానులకు రూ.52 వేలు జరిమానా సైతం విధించినట్లు ఆ శాఖ అసిస్టెంట్ కంట్రోలర్ శ్రీరాములు తెలిపారు. ఎమ్మార్పీ కంటే ఎక్కువ ధరకు వస్తువులు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. తనిఖీల్లో ఆ శాఖ ఇన్‌స్పెక్టర్ పీవీఎం.పరమేశ్వరకుమార్, టెక్నికల్ అసిస్టెంట్ శ్రీనివాసులు, సిబ్బంది పాల్గొన్నారు.

అవీ-ఇవీ

ఉపాధ్యాయ బదిలీల్లో ఖాళీలు చూపించాలి

కర్నూలు సిటీ: ఉపాధ్యాయ బదిలీల్లో అన్ని ఖాళీలు చూపించాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు గోకారి డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం ఆ సంఘం నాయకులు డీఈఓ రంగారెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బదిలీల్లో తెలు గు, హిందీ స్కూల్ అసిస్టెంట్ ఖాళీలను బ్లాక్ చేయడం ఆశాస్త్రీయమని, వెంటనే విద్యాశాఖ అధికారులు స్పందించి పునఃసమీక్షించాలన్నా రు. డీఈఓకు వినతి పత్రం ఇచ్చిన వారిలో ఆ సంఘం నాయకులు జి.నాగరాజు, గోవింద నాయక్, నాగన్న, తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌వీపీఎస్ నూతన కమిటీ ఏర్పాటు

కర్నూలు సిటీ: రాయలసీమ విద్యార్థి పోరాట సమితి నూతన కమిటీని ఎన్నుకున్నారు. శనివారం స్థానిక ఏక్యాంపులోని ఆ సమితి కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆర్‌వీపీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రవికుమార్ పాల్గొని నూతన కమిటీకి ఎంపికైన వారికి నియమాక పత్రాలు అందజేశారు. జిల్లా కమిటీలో ఉపాధ్యక్షుడిగా వెంకటేశ్వర్లు, నందికొట్కూరు నియోజకవర్గ అధ్యక్షుడిగా శివశంకర్ యాదవ్, కర్నూలు నగర అధ్యక్షుడిగా అజిత్, నగర ప్రధాన కార్యదర్శిగా రాజేంద్ర, నగర కార్యదర్శిగా గణేష్‌ను ఎంపిక చేశారు. కార్యక్రమంలో సమితి నాయకులు ఈశ్వరయ్య, వసీం, సాయి సుదర్శన్, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

దేవదాయ శాఖ ఏసీగా రామాంజనేయులు

కర్నూలు కల్చరల్: దేవదాయ శాఖ నూతన అసిస్టెంట్ కమిషనర్‌గా ఎం. రామాంజనేయులు శనివారం బాధ్యతలు స్వీకరించారు. ప్రభుత్వ సాధారణ బదిలీల్లో భాగంగా అనంతపురం నుంచి కర్నూలుకు బదిలీ అయిన ఈయన ఏసీ కె.ఆదిశేషు నాయుడు నుంచి బాధ్యతలు స్వీకరించారు.

స్టేట్ ఆడిట్ డైరెక్టర్‌పై చర్యలు తీసుకోండి

- ప్రభుత్వానికి చెడ్డపేరు వచ్చే విధంగా డైరెక్టర్ వ్యవహరిస్తున్నారు
- ఉమ్మడి జిల్లా ఎన్‌జీఓ నేతలు ధ్వజం



సమావేశంలో మాట్లాడుతున్న వీసీహెచ్ వెంగళరెడ్డి

కర్నూలు(అగ్రికల్చర్): స్టేట్ ఆడిట్‌లో రాయలసీమ జోన్‌లో జూనియర్ ఆడిటర్స్, సీనియర్ ఆడిటర్ల బదిలీల్లో నిబంధనలకు నీళ్లొదిలి ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న డైరెక్టర్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని ఏపీ ఎన్‌జీఓ అసోసియేషన్ ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ అధ్యక్ష, కార్యదర్శులు వీసీహెచ్ వెంగళరెడ్డి, జవహర్‌లాల్ ప్రభుత్వాన్ని కోరారు. ఆర్‌డీడీ అధికారాలను తన చేతుల్లోకి తీసుకొని బదిలీల్లో పెద్ద ఎత్తున అక్రమాలకు పాల్పడిన డైరెక్టర్ తీరుపై ప్రభుత్వానికి ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. శనివారం రాయలసీమ జిల్లాల్లోని స్టేట్ ఆడిట్ ఉద్యోగుల సంఘాల నేతలతో కలిసి వ్యవసాయ శాఖ కర్నూలు ఏడీఏ కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడారు. ప్రభుత్వానికి చెడ్డపేరు తెచ్చే విధంగా వ్యవహరిస్తున్న డైరెక్టర్‌ను విధుల నుంచి తప్పించాలని పేర్కొన్నారు. అనంతరం కలెక్టరేట్ ఎదుట డైరెక్టర్ తీరును నిరసిస్తూ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...ప్రభుత్వం పకడ్బందీగా బదిలీల ప్రక్రియను చేపట్టేందుకు స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేసిందని, అన్ని శాఖల్లో ఎలాంటి సమస్య లేకుండా మే నెల 31తోనే బదిలీల ప్రక్రియ పూర్తి అయిందని తెలిపారు. స్టేట్ ఆడిట్‌లో కర్నూలు ఆర్‌డీడీ గోవిందప్ప నిబంధనల ప్రకారం రాయలసీమ జోన్‌లో 36 మందిని బదిలీ చేశారని పేర్కొన్నారు. ఈ బదిలీలను పక్కనపెట్టి మార్గదర్శకాలకు విరుద్ధంగా డైరెక్టర్ ఏకంగా 56 మందిని బదిలీ చేశారన్నారు. ఆర్థిక శాఖ మంత్రిని మర్యాద పూర్వకంగా కలిసిన ముగ్గురు ఉద్యోగులను సస్పెండ్ చేశారన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఎన్‌జీఓ అసోసియేషన్ కర్నూలు నగర శాఖ అధ్యక్షుడు ఎంసీ కాశన్న, జిల్లా నేతలు ప్రభాకర్‌రెడ్డి, భాస్కరనాయుడు, కేసీహెచ్ కృష్ణుడు, వివిధ జిల్లాల ఆడిట్ ఉద్యోగుల సంఘాల నేతలు కరీముల్లా, నాగరాజు, అజయ్‌కుమార్, దస్తగిరి, మూర్తి, రఘు తదితరులు పాల్గొన్నారు.

పేదల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం



సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కల్లూరు: పేదల ఆర్థికాభివృద్ధే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ లక్ష్యమని పార్టీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. శనివారం సాయంత్రం తడకనపల్లె మజార గ్రామం వామ సముద్రంలో ఎమ్మెల్యే గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన గ్రామంలో వృద్ధులు, మహిళలను ఆప్యాయంగా పలకరిస్తూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. గ్రామంలో ఏమైనా సమస్యలు ఉంటే తనకు తెలియజేయాలన్నారు. తాగునీరు సరిగా రావడం లేదని, గృహాలు మంజూరు చేయాలని పలువురు ఎమ్మెల్యేను కోరారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజా సమస్యలు తెలుసుకునేందుకే ప్రజాప్రతినిధులందరం గడప గడపకు వస్తున్నామన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను సచివాలయ సిబ్బంది, వలంటీర్లు సకాలంలో తెలియజేస్తున్నారా? లేదా? అని ఆరాతీశారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ద్వారా ప్రతి గడపకూ లబ్ధి చేకూరుతుందన్నారు. జనరంజక పాలన అందిస్తున్న సీఎంకు రాబోయే ఎన్నికల్లో మరోసారి పట్టంకటాలని కోరారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ చంద్రశేఖర్‌రెడ్డి, ఎంపీటీసీ మునిస్వామి, సల్కాపురం సర్పంచ్ మద్దిలేటి, నారాయణరెడ్డి, సత్యంరెడ్డి, నాగేశ్వరరెడ్డి, హనుమంతురెడ్డి, నారాయణ ఈఓఆర్డీ రవికిషోర్, వివిధ శాఖల మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

దేవదాయ స్థలం స్వాధీనం

కర్నూలు : స్థానిక చిదంబరరావు వీధిలో కోట ఆంజనేయస్వామి దేవాలయానికి సంబంధించిన స్థలంలో 20 కుటుంబాలు కొన్నేళ్లుగా నివాసముంటున్నాయి. ఖాళీ చేయాలని ఇటీవల హైకోర్టు ఉత్తర్వులిచ్చింది. అయినప్పటికీ ఆయా కుటుంబాలు ఖాళీ చేయకుండా అక్కడే నివాసముండటంతో శనివారం దేవదాయ శాఖ, రెవెన్యూ అధికారులు కలిసి పోలీసుల సాయంతో స్థలం వద్దకు వెళ్లారు. ఈ సందర్భంగా ఉద్రిక్త పరిస్థితి ఏర్పడింది. డీఎస్పీ విజయశేఖర్, సీఐలు తిమ్మారెడ్డి, శ్రీనివాసులు తమ సిబ్బందితో అక్కడ బందోబస్తు విధులు నిర్వహించగా దేవదాయ శాఖ అధికారులు ఇళ్లను ఖాళీ చేయించేందుకు ప్రయత్నించారు. దీంతో వారు అధికారులకు వ్యతిరేకంగా కొద్దిసేపు ఆందోళనకు దిగారు. హైకోర్టు ఉత్తర్వుల మేరకు స్థలం ఖాళీ చేసి దేవదాయ శాఖకు అప్పగించాలని రెవెన్యూ అధికారులు సూచించినప్పటికీ పేదలు ఆందోళనకు దిగడంతో సీఐ తిమ్మారెడ్డి కలగజేసుకుని ప్రత్యామ్నాయం కోసం కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్ ఖాన్‌ను కలిసేందుకు అవకాశం కల్పిస్తానని హామీ ఇవ్వడంతో పేదలు ఆందోళన విరమించి స్థలాన్ని ఖాళీ చేశారు.

సీనియర్లకు అన్యాయం

కర్నూలు సిటీ: విద్యాశాఖ అధికారులు తీసుకున్న నిర్ణయాలతో ఉపాధ్యాయుల బదిలీల్లో తమకు తీవ్ర అన్యాయం జరుగుతుందని భాషా పండిట్లు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం రాష్ట్రీయ పండిత పరిషత్ ఆధ్వర్యంలో భాషా పండితులు, పీఈటీలు డీఈఓ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. సంఘం రాష్ట్ర కార్యదర్శి ప్రేమ్ కుమార్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కె.రఘు, జి.నాగేంద్రుడు పాల్గొని ప్రసంగించారు. ఉపాధ్యాయుల బదిలీల్లో అందరికీ ఒకే న్యాయం జరగాలన్నారు. ధర్నాలో సంఘం నాయకులు వెంకట్రామిరెడ్డి, గౌరవ అధ్యక్షుడు హబీబుల్లా, చిన్న రామన్న, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ప్రభుత్వాన్ని గద్దెదింపాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

కర్నూలు (రూరల్) : కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దింపాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ పిలుపునిచ్చారు. శనివారం నగరంలోని సీఆర్ భవనంలో ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రామకృష్ణ హాజరై మాట్లాడారు. 9 సంవత్సరాలుగా అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం దేశాన్ని కార్పొరేట్ శక్తులకు ధారాదత్తం చేస్తుందన్నారు. ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న బీజేపీ ప్రభుత్వాన్ని ఇంటికి పంపడానికి లౌకిక, ప్రజాస్వామ్య పార్టీలు ఏకం కావాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామచంద్రయ్య, జిల్లా కార్యదర్శి గిడ్డయ్య, సహాయ కార్యదర్శి రసూల్, జిల్లా కార్యవర్గ సభ్యులు జగన్నాథం, నగర కార్యదర్శి రామకృష్ణారెడ్డి, మునెప్ప, సంపన్న గౌడ్, విరుపాక్షి, భాస్కర్, లలితమ్మ, కారుమంచి మద్దిలేటి, కృష్ణ, చంద్రశేఖర్, నబిరసూల్ పాల్గొన్నారు.

మౌలిక వసతులు కల్పించాలి

కర్నూలు (రూరల్): జగన్నాథ గట్టుపై నిర్మించిన టిడ్కో, ఇందిరమ్మ గృహ సముదాయాల్లో మౌలిక వసతులు కల్పించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ డిమాండ్ చేశారు. శనివారం ఈ అంశంపై జిల్లా కలెక్టర్ సృజనకి వినతి పత్రం ఇచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జగన్నాథ గట్టులోని జర్నలిస్టుల స్థలాల్లో అక్రమ మైనింగ్ చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిలా కార్యదర్శి గిడ్డయ్య, సీనియర్ నాయకులు జగన్నాథం, మునెప్ప, మనోహర్ మాణిక్యం, జిల్లా కార్యవర్గ సభ్యులు చంద్రశేఖర్, ప్రజా నాట్యమండలి జిల్లా కార్యదర్శి నాగరాజు, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు, నగర కార్యదర్శి రామకృష్ణ రెడ్డి, సహాయ కార్యదర్శి మహేష్, ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలి



సర్టిఫికెట్లు ప్రదానం చేస్తున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ బి. రామగిడ్డయ్య

కర్నూలు(హాస్పిటల్): గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ బి. రామగిడ్డయ్య చెప్పారు. కర్నూలు మెడికల్ కాలేజీ ఆవరణలోని ప్రభుత్వ నర్సింగ్ కళాశాలలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల (ఎంఎల్‌హెచ్‌పీ)కు ఆరు రోజులుగా నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమం శనివారం ముగిసింది. ఈ కార్యక్రమానికి హాజరైన డీఎంహెచ్‌ఓ డాక్టర్ బి. రామగిడ్డయ్య మాట్లాడుతూ పాము, తేలు, కుక్కకాటుకు ప్రథమ చికిత్స, రోడ్డు ప్రమాద బాధితులకు సత్వర ప్రథమ చికిత్స, వారిని పై ఆసుపత్రులకు రెఫర్ చేయడం, గాయాలకు కుట్లు వేయడం, కట్టు కట్టడం, వివిధ రకాలైన ఇంజెక్షన్లు వేయడం, అత్యవసర పరిస్థితుల్లో సీపీఆర్ చేయడం గురించి శిక్షణలో అభ్యసించారన్నారు. తద్వారా మీ పరిధిలోని ప్రజలకు మరింత మెరుగైన వైద్యసేవలు అందించాలని సీహెచ్‌ఓలకు ఆదేశించారు. అనంతరం వారికి సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ప్రభుత్వ ఆసుపత్రి ఎమర్జెన్సీ మెడిసిన్ హెచ్‌ఓడీ డాక్టర్ రామశివ నాయక్, వైస్ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ రోజారమణి, డీపీఓ విజయరాజు, నోడల్ అధికారులు ఐజాల్ హక్, సుబ్రహ్మణ్యం, అధ్యాపకులు రుక్మిణి, సరళ, మంజుల పాల్గొన్నారు.

సైక్లింగ్ శరీరానికి, పర్యావరణానికి మేలు



జెండా ఊపి ర్యాలీ ప్రారంభిస్తున్న ఉర్దూ వర్సిటీ రిజిస్ట్రార్ బాయినేని శ్రీనివాసులు

కర్నూలు(హాస్పిటల్): ప్రతిరోజూ సైకిల్ తొక్కడం ఇటు శరీరానికి ఆరోగ్యం పెంపొందడమే గాక అటు పర్యావరణానికి మేలు జరుగుతుందని డీఎంహెచ్‌ఓ డాక్టర్ బి. రామగిడ్డయ్య చెప్పారు. ప్రపంచ సైకిల్ దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం స్థానిక డాక్టర్స్ కాలనీలోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద సైకిల్ ర్యాలీని ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సైకిల్ తొక్కడం ద్వారా శరీరానికి రోగనిరోధకశక్తి పెరుగుతుందని, అధిక రక్తపోటు, షుగర్, గుండెజబ్బులు వంటి సమస్యలు తగ్గిపోతాయన్నారు. ఊపిరితిత్తులు చాలా బలంగా ఉంటాయని, అధికంగా ఉన్న కొవ్వు కరుగుతుందన్నారు. సాధారణం కంటే ఎక్కువ శ్వాస తీసుకుంటామని తెలిపారు. వీలైనంత వరకు ప్రతిరోజూ 30 నిమిషాల పాటు సైకిల్ తొక్కడం వల్ల అనారోగ్యం పడే అవకాశాలు తగ్గుతాయని పేర్కొన్నారు. చిన్నవయస్సు నుంచే పిల్లలకు తల్లిదండ్రులు సైకిల్ తొక్కడం అలవాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా వ్యాధినిరోధక టీకాల అధికారి డాక్టర్ ప్రవీణ్‌కుమార్, డీపీఎంయూ డాక్టర్ ఉమ, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మాధవి, డాక్టర్ హకీం రషీద్, డీపీవో విజయరాజు, డెమో శ్రీనివాసులు, డిప్యూటీ డెమో చంద్రశేఖర్‌రెడ్డి, ప్రాజెక్షనిస్టు ఖలీల్ పాల్గొన్నారు.

సైక్లింగ్‌తో ఆరోగ్యం

కర్నూలు (న్యూసిటీ): ప్రతి రోజూ సైక్లింగ్ చేస్తే ఆరోగ్యంగా ఉండొచ్చని ఉర్దూ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ఆచార్య డాక్టర్ బాయినేని శ్రీనివాసులు తెలిపారు. శనివారం డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ విశ్వవిద్యాలయంలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ప్రపంచ సైకిల్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ జెండా ఊపి సైకిల్ ర్యాలీని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 2018 సంవత్సరం ఏప్రిల్‌లో ఐక్యరాజ్య సమితి జనరల్ అసెంబ్లీ జూన్ 3వ తేదీని ప్రపంచ సైకిల్ దినోత్సవంగా ప్రకటించిందన్నారు. సైకిల్ తొక్కడం ద్వారా ఆరోగ్యంతోపాటు పర్యావరణ పరిరక్షణలో భాగస్వామ్యం కావచ్చని చెప్పారు. ఉద్యోగస్తులందరూ వారంలో ఒక్కరోజు సైకిల్ మీద కార్యాలయాలకు వెళ్లాలన్నారు. కార్యక్రమంలో యూనివర్సిటీ ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ డాక్టర్ షఫీ, ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ డాక్టర్ వెంకటప్ప, సిబ్బంది, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

ఈఆర్‌సీ ప్రధాన కార్యాలయం ఏర్పాటుకు స్థల పరిశీలన



ఈఆర్‌సీ కార్యాలయ నిర్మాణం కోసం ట్రాన్స్‌కో 220 కేవీ సబ్ స్టేషన్‌లో చర్చిస్తున్న సభ్యులు

కర్నూలు(రాజ్‌విహార్): ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ (ఏపీ ఈఆర్‌సీ) ప్రధాన కార్యాలయాన్ని కర్నూలులో ఏర్పాటు చేసేందుకు అధికారులు స్థలం పరిశీలించారు. శనివారం కమిషన్ సభ్యులు నగర శివారులోని దిన్నెదేవరపాడు రోడ్డులో (ఏపీ కార్బైడ్ ఫ్యాక్టరీ వద్ద) ఉన్న ట్రాన్స్‌కో సబ్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. 220 కేవీ సామర్థ్యం ఉన్న ఉప కేంద్రానికి సంబంధించిన స్థలాలను తనిఖీ చేశారు. ఈ సబ్ స్టేషన్‌లోని రెండు ఎకరాల స్థలంలో ఈఆర్‌సీ పక్కా భవనాన్ని నిర్మించేందుకు గత నెల 26వ తేదీన కమిషన్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీంతో ఈఆర్‌సీ సెక్రటరీ కె. రాజబాపయ్య, సభ్యులు ఠాకూర్ రామసింగ్ కర్నూలుకు వచ్చి సివిల్, ఎలక్ట్రికల్ అధికారులు సమావేశమయ్యారు. స్థలం, స్వభావం, భవన నిర్మాణం కోసం ప్రణాళిక లు పరిశీలించారు. ఇక్కడి పరిస్థితులను ఎస్ఈలు ఉమాపతి, కృష్ణకుమార్, సివిల్ అధికారులు వివరించారు. సభ్యుల వెంట ఈఈ రజినీకాంత్ రెడ్డి ఉన్నారు.

రేపటి నుంచి ఉర్దూ టీచర్లకు శిక్షణ

కర్నూలు సిటీ: జిల్లాలోని జిల్లా పరిషత్, ప్రభుత్వ, మున్సిపల్ యాజమాన్యాలకు చెందిన స్కూళ్లలో 2018 డీఎస్సీ ద్వారా ఎంపికైన ఉర్దూ మీడియం టీచర్లకు ఈ నెల 5 నుంచి ఇండక్షన్ ట్రైనింగ్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ప్రభుత్వ డైట్ కాలేజీ ప్రిన్సిపాల్ వసుంధర శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 9వ తేదీ వరకు ప్రతి ఉదయం 8.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు బి.తాండ్రపాడులోని డైట్ కాలేజీలో శిక్షణ జరుగుతుందన్నారు.

శుభ్రంగా గ్రంథాలయాలు

కర్నూలు కల్చరల్: జిల్లా కేంద్ర గ్రంథాలయంలో శనివారం గ్రంథాలయ సంస్థ ఉద్యోగులు జగనన్న స్వచ్ఛ గ్రంథాలయం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ సంస్థ డిప్యూటీ లైబ్రేరియన్ వి.పెద్దక్క మాట్లాడుతూ గ్రంథాలయాలను శుభ్రంగా ఉంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో లైబ్రేరియన్లు వజ్రాల గోవిందరెడ్డి, బాషా, తదితరులు పాల్గొన్నారు.